భారత్ X పాకిస్థాన్ మ. 3.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో | వెస్టిండీస్ X స్కాట్లాండ్ రా. 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో






# ముంబైదే ఇరానీ కప్

**27 ఏండ్ల తర్వాత ట్రోఫీ సొంతం**

లక్నో: ప్రతిష్ఠాత్మకమైన ఇరానీ కప్‌ను దేశవాళీలో దిగ్గజ జట్టు ముంబై సొంతం చేసుకుంది. ఈ ఏడాది రంజీ చాంపియన్ అయిన ముంబై.. ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో గెలవడం ద్వారా 27 ఏండ్ల తర్వాత ఈ ట్రోఫీని ముద్దాడింది. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ తొలి ఇన్నింగ్స్‌లో ముంబైకి 121 పరుగుల కీలక ఆధిక్యం దక్కడంతో ముంబై విజేతగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 537 పరుగుల భారీ స్కోరు చేయగా రెస్టాఫ్ ఇండియా 416 పరుగులకే ఆలౌట్ అయింది. ఆట ఆఖరి రోజు ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 329 పరుగుల భారీ స్కోరు చేసి తమ ఆధిక్యాన్ని 450 పరుగులకు పెంచుకుంది. చివరి రోజు ఆ జట్టు లోయరార్డర్ బ్యాటర్ తనుష్ కొటియాన్ (114 నాటౌట్) శతకంతో చెలరేగగా పదో నంబర్ ఆటగాడు మోహిత్ అవస్థి (51) అర్ధ సెంచరీతో రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై తరఫున డబుల్ సెంచరీ సాధించిన సర్ఫరాజ్ ఖాన్ (222 నాటౌట్)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. 1997-98 సీజన్ తర్వాత ముంబై జట్టు ఇరానీ కప్‌ను గెలవడం ఇదే ప్రథమం.

# దివాన్షికి రెండో స్వర్ణం

**జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్**



లిమా (పెరూ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత్ స్వర్ణ పతకాల పంట పండిస్తోంది. శనివారం జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టోల్ ఈవెంట్‌లో దివాన్షి స్వర్ణం గెలిచింది. ఫైనల్‌లో దివాన్షి 600 పాయింట్లకు గాను 564 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో ఆమెకు ఇది రెండో స్వర్ణం. భారత్‌కే చెందిన పరిషా గుప్త (559) రజతం సాధించగా మాన్వి జైన్ (557) కాంస్యం దక్కించుకుంది. దీంతో ఈ ఈవెంట్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేయడం విశేషం. ఇదే పోటీ పురుషుల విభాగంలో సూరజ్ శర్మ 571 పాయింట్లతో స్వర్ణం సాధించగా ముకేశ్ (568)కు కాంస్యం దక్కింది.



# క్రమశిక్షణకు మారుపేరు అలెన్: గోపీచంద్

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : ప్రముఖ శిక్షణాసంస్థ అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ క్రమశిక్షణకు మారుపేరని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింతగా సానబెట్టుకునేందుకు అలెన్ మంచి వేదికన్నారు. అలెన్ సంస్థ హైదరాబాద్ నుంచి తమ కార్యకలాపాలను ప్రారంభించిన సందర్భంగా శనివారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గోపిచంద్ పాల్గొని మాట్లాడారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు, అక్షర విద్యాసంస్థల చైర్మన్ జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ.. అలెన్-అక్షర విద్యాసంస్థలు కలిసి పనిచేయనున్నాయన్నారు. అలెన్ సంస్థల సీఈవో నితిన్ కుక్రేజా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆసీస్ శుభారంభం

## లంకపై ఘనవిజయం • ఇంగ్లండ్‌ను భయపెట్టిన బంగ్లా

షార్జా: మహిళల టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ వేటను డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఘనంగా మొదలుపెట్టింది. తొలి మ్యాచ్‌లోనే కంగారూలు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. గ్రూప్-ఏలో భాగంగా షార్జా వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు మాత్రమే చేయగలిగింది. నీలాక్షి డి సిల్వ (29) టాప్ స్కోరర్ కాగా హర్షిత మాధవి (23), అనుష్క సంజీవని (16) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఆసీస్ పేసర్ మేగన్ షట్ (3/12) కట్టుదిట్టమైన బంతులతో లంకకు ఆరంభంలోనే చుక్కలు చూపించింది. అనంతరం ఛేదనలో ఆసీస్.. 14.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తిచేసింది. ఆ జట్టు ఓపెనర్ బెత్ మూనీ (38 బంతుల్లో 43 నాటౌట్, 4 ఫోర్లు) ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చింది. లంక బౌలర్లు ఆరంభంలోనే కీలక వికెట్లు పడగొట్టి ఒత్తిడి పెంచినా మూనీ, పెర్రీ (17) నిలకడగా ఆడి ఆసీస్‌కు తొలి గెలుపును అందించారు. మేగన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



మేగన్ (3/12)

### ఇంగ్లండ్ కష్టమ్మీద..

గ్రూప్-బీలో బంగ్లాదేశ్.. మాజీ చాంపియన్ ఇంగ్లండ్‌ను భయపెట్టింది. ఇరుజట్ల మధ్య షార్జా వేదికగా ఆద్యంతం ఉత్కంఠగా సాగిన లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో గెలుపు కోసం బంగ్లా ఆఖరి వరకూ పోరాడినా ఇంగ్లండ్‌నే విజయం వరించింది. ఇంగ్లీష్ జట్టు నిర్దేశించిన 119 పరుగుల స్వల్ప ఛేదనలో బంగ్లాదేశ్.. 20 ఓవర్లలో 97/7 వద్దే ఆగిపోయి 21 పరుగుల తేడాతో అపజయం పాలైంది. ఆ జట్టు యువ బ్యాటర్ సోబన్ మోస్త్రి (44) బంగ్లా గెలుపు ఆశలను మోసింది. కెప్టెన్ నైగర్ సుల్తానా (15)తో కలిసి ఐదో వికెట్‌కు 25 పరుగులు జోడించింది. కానీ సుల్తానా రనౌట్ అవడం బంగ్లా కొంప ముంచింది. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు విఫలమవడంతో ఆ జట్టుకు ఓటమి తప్ప లేదు. ఒకవైపు వికెట్లు పడుతున్నా మోస్త్రి మాత్రం ఒంటరిపోరాటం చేసింది. కానీ చార్లీ డీన్ వేసిన 19వ ఓవర్‌లో మూడో బంతికి ఆమె ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడంతో ఆ జట్టు ఆశలు అడియాసలయ్యాయి. ఇంగ్లండ్ బౌలర్లలో స్మిత్ (2/11), స్పిన్నర్ చార్లి డీన్ (2/22) రాణించారు. అంతకుముం దు మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. జట్టు నిండా టీ20 స్పెషలిస్ట్ హిట్టర్లు ఉన్నప్పటికీ ప్రత్యర్థి స్పిన్నర్ల ధాటికి 20 ఓవర్లలో 118/7కే పరిమితమైం ది. వ్యాట్ హాడ్జ్ (41) మెరుగ్గా ఆడగా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫాతిమా ఖటూన్ (2/18), రితూ మోని (2/24), నహిదా అక్తర్ (2/32)చెరో రెండు వి కెట్ల చొప్పున పడగొట్టారు.



వ్యాట్ హాడ్జ్ (41)



గచ్చిబౌలిలోని బాలయోగి ఇండోర్ స్టేడియంలో శనివారం ప్రారంభమైన 37వ జాతీయ అండర్-11 పురుషులు, మహిళల చెస్ చాంపియన్ పోటీలు

# వన్డే సిరీస్ విజేత సౌతాఫ్రికా

అబుదాబి: ఐర్లాండ్‌తో అబుదాబి వేదికగా జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ మిగిలుండగానే చేజిక్కించుకుంది. రెండో వన్డేలో సఫారీలు 174 పరుగుల తేడాతో గెలుపొందారు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా.. ట్రిస్టన్ స్టబ్స్ (112) శతకంతో నిర్ణీత 50 ఓవర్లలో 343/4 పరుగుల భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఐర్లాండ్ 30.3 ఓవర్లలోనే 169 పరుగులకు ఆలౌట్ అయింది.

# అండర్-19 క్రికెట్ విజేత కరీంనగర్

## రన్నరప్‌గా మహబూబ్‌నగర్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ కేంద్రంగా గత నెల 28 నుంచి అక్టోబర్ 5 దాకా జరిగిన అండర్-19 అంతర్ జిల్లా పోటీల్లో కరీంనగర్ విజేతగా నిలిచింది. ఫైనల్‌లో కరీంనగర్ జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొంది ట్రోఫీని కైవసం చేసుకుంది. మొగిలిచర్ల క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్.. నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఆ జట్టులో షాదాబ్ (89) అబ్దుల్ (48) రాణించారు. ఛేదనలో కరీంనగర్.. 49.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 2 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. విఘ్నేష్ (53) కరణ్ (50) కరీంనగర్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ టోర్నీలో అత్యుత్తమంగా రాణించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్టు కు ఎం పిక చేయాలని ఆర్గనైజింగ్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ హెచ్‌సీఏ అధికారులను కోరారు.



రాత్రి 7 గంటలకు.. స్పోర్ట్స్18లో లైవ్

# నేటి నుంచే టీ20 పోరు

## గ్వాలియర్‌లో భారత్, బంగ్లా తొలి మ్యాచ్

**గ్వాలియర్:** స్వదేశంలో భారత్ మరో టీ20 సిరీస్‌కు సిద్ధమైంది. ఇటీవలే ముగిసిన రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను 2-0తో ఓడించి జోరుమీదున్న టీమ్‌ఇండియా.. పొట్టి పోరులోనూ అదే దూకుడు ప్రదర్శించాలనే పట్టుదలతో ఉంది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో కొత్తగా పునర్నిర్మించిన శ్రీమంత్ మాధవరావు సింధియా స్టేడియం ఈ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వనుంది. 14 ఏండ్ల తర్వాత ఈ స్టేడియంలో జరుగనున్న తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఇదే. త్వరలో న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ నేపథ్యంలో యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, అక్షర్ పటేల్, మహ్మద్ సిరాజ్ వంటి కీలక ఆటగాళ్లకు విరామమిచ్చిన భారత్.. యువ ఆటగాళ్లను పరీక్షించనుంది. నయా పేస్ సంచలనం మయాంక్ యాదవ్, యువ ఆల్ రౌండర్ నితీశ్ రెడ్డి, పేసర్ హర్షిత్ రాణా తొలి టీ20లో అరంగేట్రం చేసే అవకాశముంది. భారత్‌తో పోల్చితే అనుభవజ్ఞులైన ఆటగాళ్లు కలిగిన బంగ్లాదేశ్.. ఆతిథ్య జట్టుకు షాకివ్వాలని ప్రణాళికలు సిద్ధం చేసింది. టెస్టుల మాదిరిగా కాకుండా టీ20లలో దూకుడుగా ఆడతామని ఇప్పటికే ఆ జట్టు సారథి లిటన్ దాస్ భారత్‌కు హెచ్చరికలు కూడా పంపాడు. దిగ్గజ ఆల్ రౌండర్ షకిబ్ అల్ హసన్ రిటైర్మెంట్ తర్వాత ఆ జట్టు ఆడుతున్న తొలి సిరీస్ ఇదే.







# దాయాదితో అమ్మాయిలు

మహిళల ప్రపంచకప్‌లో భాగంగా హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత క్రికెట్ జట్టు ఆదివారం దాయాది పాకిస్థాన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. గ్రూప్-ఏలో సెమీస్ బెర్తును ఖాయం చేసుకోవాలంటే టీమ్ ఇండియాకు నేటి మ్యాచ్ అత్యంత కీలకం కానుంది. దుబాయ్ వేదికగా జరుగబోయే మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు మొదలవనుంది. ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్‌లో ప్రసారం కానుంది.

# ఆపరేషన్ కగార్‌లో గరుడ దళం!

- మావోయిస్టుల ఏరివేతలో కీలకం
- డ్రోన్లకు స్వస్తి.. గద్దలు, డేగలతో పని
- కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, మెడకు కెమెరాలు
- మొయినాబాద్‌లో శిక్షణ
- తెలంగాణ ఎస్ఐబీ నుంచే కీలక సమాచారం
- తాజా ఎన్‌కౌంటర్‌లో ఇన్ఫార్మర్లూ హతం?

హైదరాబాద్, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు.. 9 నెలల్లోనే సుమారు 188 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నా.. కాకులు దూరని కారడవిలోనూ భద్రతా దళాలు లక్ష్యాన్ని ఛేదించగలిగాయి. అందుకు కారణం 'ఈగల్ స్క్వాడ్' అని పలువురు రిటైర్డ్ ఐపీఎస్‌లు చెప్తున్నారు. ఆర్మీ నుంచి తెలంగాణ పోలీసుల వరకు గరుడ దళాన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. పూర్వం లేఖలను పంపేందుకు పావురాలను, గూఢచర్యానికి డేగలను, వేటకు జాగిలాలను, ప్రయాణానికి అశ్వాలను వినియోగించినట్టే.. ఇప్పుడు 'ఆపరేషన్ కగార్'కు 'గరుడ దళం' సహకారం కేంద్ర హోంశాఖ తీసుకుంటున్నది. సంఘ విద్రోహ శక్తుల చర్యలను పసిగట్టేందుకు, రక్షణ, రహస్య ప్రదేశాల్లో ఎగిరే డ్రోన్లను పట్టుకునేందుకు 2020లో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా గద్దలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మొయినాబాద్‌లో కొన్ని గద్దలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వాటిని మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర హోంశాఖ ఉపయోగించిందని పలువురు చెప్తున్నారు.



## గరుడ దళం ప్రత్యేకతలివే..

తొలుత నిఘాలో పావురాలకు శిక్షణ ఇద్దామని భావించినా అవి ప్రతికూల వాతావరణంలో ఎగరలేకపోవడంతో డేగలవైపు మళ్లారు. డేగలు తుఫాను సమయంలోనూ మేఘాల కంటే ఎత్తులో వెళ్లి అవి శ్రాంతంగా పనిచేస్తాయి. దీంతో నల్లమల అడవుల్లోంచి రెండేళ్ల వయసున్న డేగ పిల్లలను తెచ్చి వాటికి మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటీఏ)లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సంఘ విద్రోహక శక్తులు ఉపయోగించే డ్రోన్లను సులభంగా గుర్తించేలా తర్ఫీదునిచ్చారు. అవి రెండు కిలోల దాకా బరువును కూడా కొన్ని కిలోమీటర్ల దూరం వరకు సులభంగా మోసుకురాగలవు. ప్రధాని, ఇతర ప్రముఖుల పర్యటనల సందర్భంగా డ్రోన్లపై నిషేధం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో డేగలు నిఘా పెట్టి మరీ ఏవైనా డ్రోన్లు గాల్లోకి ఎగిరితే వాటిని పట్టుకొచ్చి, అధికారులకు అప్పగిస్తాయి. డేగలకు అమర్చే కెమెరాల ద్వారా నిషేధిత, అనుమానిత ప్రాంతాల్లో వ్యక్తుల కదలికలను రికార్డ్ చేస్తుంటారు. ప్రపంచంలో ఇలాంటి డేగలు ఒక్క నెదర్లాండ్స్‌లోనే ఉన్నాయని నాటి డీజీపీ రవిగుప్తా మీడియాకు తెలిపారు.

### ఎక్కడ నక్కి ఉన్నా.. పసిగట్టే 'కన్ను'

కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి దేశంలో మావోయిస్టు వ్యవస్థ ఉండొద్దనే లక్ష్యంతో చేపట్టిన 'ఆపరేషన్ కగార్'కు తెలంగాణలో శిక్షణ పొందిన, పొందుతున్న గద్దలను వినియోగించినట్టు విశ్వసనీయ సమాచారం. దేశంలోనే తొలిసారిగా తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా ఈగల్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసుకున్నారని, ప్రత్యేక శిక్షణ పొందిన గద్దలతో డ్రోన్ దాడులకు చెక్ పెట్టవచ్చని నాటి డీజీపీ రవి గుప్తా ఓ సందర్భంలో చెప్పారు. వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్, మెడకు, రెక్కల కింద మైక్రో కెమెరాలు అమర్చినట్టు తెలిసింది. వీటి ద్వారానే మావోయిస్టుల సమాచారం తెలుసుకొని, పథకం ప్రకారం కాల్పులు జరిపారని పలువురు అంటున్నారు. వానకాలం, చలికాలాల్లో వాతావరణం ప్రతికూలంగా ఉన్నా.. పోలీసులు విజయం సాధించడానికి ముఖ్యకారణం గరుడ దళమేనని స్పష్టంచేస్తున్నారు. కొంతకాలంగా కోవర్టు ఆపరేషన్లకు ప్రాధా న్యం ఇస్తున్న భద్రతా బలగాలు.. అదను చూసి ఇన్ఫార్మర్లనూ హతమారుస్తున్నట్టు తెలిసింది. తాజా ఎన్‌కౌంటర్‌లో కొందరు ఇన్‌ఫార్మర్లు కూడా ఉన్నట్టు చెప్తున్నారు.

## మావోయిస్టు ఆశన్న మృతి చెందినట్టు పుకార్లు

వెంకటాపూర్, అక్టోబర్ 5: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 40 మంది మావోయిస్టులు మృతి చెందగా, అందులో ఆశన్న ఉన్నట్టు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్నది. ఈ విషయమై ఎస్సై జక్కుల సతీశ్‌ను వివరణ కోరగా.. ఆశన్న మృతిచెందిన విషయం శనివారం రాత్రి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఆశన్న.. మాజీ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి హత్య కేసులో ఆశన్న ప్రధాన నిందితుడని, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు, మాజీ సీఎం జనార్దనరెడ్డిలపై జరిగిన దాడుల్లో ప్రధాన పాత్ర వహించినట్టు గతంలో పోలీసులు ప్రకటించారు.

# ఎన్‌కౌంటర్ మృతులు 31 మంది

- మావోయిస్టుల భేటీపై పోలీసులకు సమాచారం
- కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురుకాల్పులు
- మృతులపై రూ.1.30 కోట్లకు పైనే రివార్డు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి: పౌరహక్కుల నేతలు



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఉంచిన మావోయిస్టుల మృతదేహాలు

కొత్తగూడెం క్రైం, అక్టోబర్ 5: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టుల మృతదేహాలు లభ్యమైనట్టు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం తెలిపారు. వీరిలో 13 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారని చెప్పారు. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన వివరాలను శనివారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ - దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టు అగ్రనేతలు సమావేశమయ్యారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ - కోబ్రా, ఎస్‌టీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా నారాయణ్‌పూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధిలోని నెందూర్ - తులతులీ గ్రామల మధ్య గల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో రెండు గంటల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. మృతులు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) 6వ కంపెనీ, తూర్పు బస్తర్ డివిజన్‌కి చెందిన వారిగా గుర్తించారు. మృతి చెందిన వారిలో రూ.25 లక్షల రివార్డున్న దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, తూర్పు బస్తర్ డివిజన్ ఇన్‌చార్జి నీతి అలియాస్ ఊర్మిలతో పాటు డివిజినల్ కమిటీ సభ్యులు సురేశ్ సలాం, మీనా మడకం ఉన్నారు. ఇప్పటివరకు గుర్తించిన మృతులపై రూ.1.30 కోట్ల రివార్డు ఉంది.

### మృతుల ఫొటోలు బయటపెట్టాలని డిమాండ్

ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు ముఖ్య నేతలు నంబాల కేశవరావు, తక్కెళ్లపాడు వాసుదేవరావు ఉన్నారనే సమాచారం అందుతున్నట్టు పౌరహక్కుల సంఘల నేతలు తెలిపారు. పోలీసులు వెంటనే మరణించిన మావోయిస్టుల పేర్లు, ఫొటోలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్ హైదర్‌గూడలో మాట్లాడుతూ ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.